# తెనాలిలో ఘోరకలి

- పూటుగా తాగి దళిత యువతి పట్ల అసభ్య ప్రవర్తన
- అడ్డుకున్న తల్లిని లారీ కిందకు నెట్టేసిన కిరాతకులు
- బార్ ముందు అఘాయిత్యం.. కన్ను మూసిన మహిళ
- కాంగ్రెస్ నేత కొడుకే ప్రధాన నిందితుడని ఆరోపణలు





తెనాలి ఆర్డీవో కార్యాలయం ఎదుట వామపక్షాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా ★ పోలీసులు అరెస్టు చేసిన ఏడుగురు నిందితులు



ప్రధాన నిందితుడు నాగరాజు

తెనాలి – న్యూస్‌టుడే

మహిళలకు భరోసానిచ్చే 'నిర్భయ' చట్టంపై రాష్ట్రపతి చేసిన సంతకం ఇంకా తడి ఆరనైనా లేదు.. మరో దారుణం చోటుచేసుకుంది. ఈసారి మన రాష్ట్రంలోనే! మద్యం మత్తెక్కిన 'మృగాళ్లు' నడిరోడ్డు మీదే ఓ దళిత యువతిపై అసభ్యంగా ప్రవర్తించారు.. ఆ వికృత చేష్టలను అడ్డుకున్న ఆమె తల్లిని వేగంగా వస్తున్న లారీ కిందకు తోసేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో సోమవారం రాత్రి జరిగిన ఈ క్రూర సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ మహిళ మంగళవారం తెల్లవారు జామున కన్నుమూసింది. ఈ దారుణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నది స్థానిక కాంగ్రెస్ నేత, బార్ యజమాని ఉమ్మలనేని జానకీరామ చంద్రరావు కుమారుడు కావడం, అతడిని తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వార్తలు రావడంతో దళిత, న్యాయవాద సంఘాలు, రాజకీయ నాయకులు భారీగా నిరసనలు చేపట్టాయి. దీంతో ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. ప్రధాన నిందితుడితో సహా మరికొందరిని అరెస్టు చేసినట్లు మంగళవారం రాత్రి ప్రకటించారు.

తెనాలిలోని మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బేతాళం బాబూరావు భార్య సునీల (45) కుమార్తెతో కలిసి సోమవారం రాత్రి మార్కెట్‌కు వెళ్లారు. ఇంటికి తిరిగి వస్తుండగా గాంధీ చౌక్ దగ్గర్లో ఉన్న కాంగ్రెస్ నేతకు చెందిన ఓ బార్ వద్ద మద్యం మత్తులో ఉన్న యువకుల గుంపు తారసపడింది. వారిలో ఒకడు ఆమె కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. మాటలతో, చేతలతో హింసించటంతో తల్లి సహించలేక వారిని ఎదుర్కొనే ప్రయత్నం చేసింది. ఆ యువకులు ఆమెపైనా దాడికి దిగారు. ఒక్కసారిగా ఆమెను నెట్టేయడంతో వెనకగా వస్తున్న లారీ కిందపడి తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున ఆమె మరణించింది. ఈ దురంతంపై దళిత సంఘాలు తీవ్ర ఆగ్రహం చెందాయి. ఈ కేసులో బార్ యజమాని, కాంగ్రెస్ నాయకుడైన జానకీరామచంద్రరావు కుమారుడు నాగరాజు ప్రధాన నిందితుడు కాగా, అతనిని పోలీసులు తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ దళిత సంఘాలు, న్యాయవాద సంఘాలు ఆందోళనకు దిగాయి. వీరికి తెదేపా, వామపక్షాలు, భాజపా, వైకాపా, నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సి.పి.ఎం నాయకురాలు ధూళిపాళ్ల రమాదేవి, వైకాపా నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.

**స్పీకరు నాదెండ్ల సంతాపం:** స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ నాదెండ్ల మనోహర్ బాధితురాలి కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ఈ సంఘటన వెనుక తమ పార్టీ నాయకులున్నా చర్యలు తీసుకోవటంలో వెనకాడవద్దని డీఎస్పీని ఆదేశించానని ఆయన ఫోన్ ద్వారా 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

**కళ్లముందే అమ్మను తోసేశారు...** మార్కెట్ సెంటర్లో డ్రస్‌లు కొనుక్కుని తల్లి, తాను వస్తున్నామని, మద్యం మత్తులో ఉన్న యువకుల్లోని ఒకరు తనకు చేయితగిలేలా మీదకు వచ్చాడని బాధితురాలు తెలిపింది. వారించబోగా మరింత మీదకు వచ్చారని వివరించింది. తన తల్లి అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆమెను బలవంతంగా లారీ కిందికి తోసేశారని కన్నీరు పెట్టింది. దగ్గర్లో ఉన్న పోలీసులను కేకలు వేసి పిలిచినా పట్టించుకోలేదని, స్థానికులే లారీని ఆపి హడావిడి చేశాక వారు వచ్చారని, ముందే స్పందించి ఉంటే తన తల్లి తమకు దక్కేదని ఆమె కన్నీరు మున్నీరవుతోంది.

**కాంగ్రెస్ నేత కొడుకే కారకుడు...** దీనంతటికీ ఆ కాంగ్రెస్ నాయకుని కుమారుడే కారణమని మృతురాలి భర్త బాబూరావు ఆరోపించారు. ఇంటి దగ్గర ఉన్న తాను తన కుమార్తె ఫోన్ చేయగానే పరిగెత్తుకు వచ్చేసరికి తనకు భయానక వాతావరణం కనిపించిందని చెప్పారు. పోలీసులు వెంటనే స్పందించి ఉంటే తన భార్య బతికేదని ఆవేదన వ్యక్తంచేశారు.

**రాజకీయాలకు అతీతంగా దర్యాప్తు:** సునీల హత్యోదంతంలో రాజకీయాలకు అతీతంగా దర్యాప్తు చేస్తున్నామని, ఈ విషయంలో తమపై ఎలాంటి ఒత్తిడులు లేవని జిల్లా రూరల్ ఎస్పీ సత్యనారాయణ తెలిపారు. బార్ యజమాని కుమారుడు నాగరాజును అరెస్టు చేసినట్లు ప్రకటించారు. పోలీసులు సకాలంలో స్పందించ లేదనడం సమంజసం కాదన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో తాను స్వయంగా మాట్లాడి వివరాలు సేకరించానని తెలిపారు.

**ఏడుగురు నిందితులు:** ఈ సంఘటనలో ఏడుగురు నిందితులు ఉన్నట్లు తేలిందని, వారిలో మోకా సుబ్రహ్మణ్యం ప్రధాన నిందితుడని డీఎస్పీ తులసీరాంప్రసాద్ చెప్పారు. పోలీసులు వెంటనే స్పందించలేదనడం సరికాదని అన్నారు. తమ కానిస్టేబుల్, ఎస్.ఐ. వెంటనే స్పందించారని, ఆమెను 108లో ఆసుపత్రికి తరలించి, దాడికి కారణమైన వారిలో ఇద్దరిని వెంటనే అదుపులోకి తీసుకున్నారని, దానివల్లే ఈ సంఘటనకు కారకులైన ఏడుగురు నిందితుల్ని 15 గంటల్లోనే పట్టుకున్నామని డీఎస్పీ చెప్పారు.

తమ బార్ ముందు జరిగిన ఘటనలో నా కుమారుని పాత్ర లేదని కాంగ్రెస్ నేత, బార్ యజమాని జానకీరామ చంద్రరావు తెలిపారు. షాపు దగ్గర సి.సి. కెమేరాలు కూడా ఉన్నాయని, వాటిలో చిత్రాలు చూసి తన కుమారుని పాత్ర ఉందని తేలితే శిక్షించవచ్చని అన్నారు.